క్లుప్తంగా

18న 'మన ఊరు -మన బడి' సమావేశం

కెరమెరి: మండలంలోని 'మన ఊరు -మన బడి' కార్యక్రమంలో భాగంగా ఎంపికైన ప్రధానోపాధ్యాయులకు ఈ నెల 18న మధ్యాహ్నం ఒంటి గంటకు కెరమెరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఎంఈవో కుడ్మెత సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సంబంధిత హెచ్ఎంలు, ఎస్ఎంసీ చైర్మన్, సర్పంచ్, కాంట్రాక్టర్ తగు సమాచారంతో హాజరు కావాలన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ శనివారం చిర్రకుంట ఫీడర్‌కు చెందిన గ్రామస్తులు విద్యుత్ శాఖ ఎస్ఈ వాసుదేవ్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గత ఆరు నెలల నుంచి చిర్రకుంట ఫీడర్ పరిధిలోని 58 గ్రామాలకు కరెంట్ సరిగ్గా రాక ఇబ్బందులు పడుతున్నామని, సంబంధిత లైన్‌మెన్‌కు ఫోన్ చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న ఏఈ శ్రీనివాస్‌ను వెంటనే బదిలీ చేయాలని కోరారు. కార్యక్రమంలో చిర్రకుంట ఎంపీటీసీ శంకర్, సీడం కైలాస్, దత్తు, లక్ష్మణ్, భీమయ్య తదితరులు ఉన్నారు.

రుణాలకు ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీవో

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని రైతువేదికలో మైనారిటీ, దివ్యాంగుల రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శనివారం ఎంపీడీవో గంగాసింగ్, టీజీబీ మేనేజర్ రాజేశ్వర్ రావు ఇంటర్వ్యూలు నిర్వహించారు. దివ్యాంగులకు ఒక యూనిట్ మంజూరు కాగా 34 మంది, మైనారిటీలకు ఒక యూనిట్‌కు 26 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు వారు తెలిపారు.

వీవోఏల మండల కార్యవర్గం ఎన్నిక


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

పెంచికల్‌పేట్: ఐకేపీ వీవోఏల మండల కార్యవర్గాన్ని మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దేవనపల్లి రోజా, కార్యదర్శిగా దుర్గం తులసీరాం, సహాయ కార్యదర్శిగా సొద్దరి రవి, కోశాధికారిగా పాగిడె బాగిలాల్, ఉపాధ్యక్షులుగా సంగీతా, అంకితలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజేందర్, క్రిష్ణమాచారి పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్
కుమురంభీం : రుద్రుడు
కాగజ్‌నగర్
వెంకటరమణ : రుద్రుడు
- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	60
దోసకాయ	50
చామగడ్డ	60
వంకాయ	40
బీరకాయ	60
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	40
సోరకాయ	60
రతాళం	60
గోబి(పూల్)	40
క్యాబేజి	40

-ఆసిఫాబాద్‌అర్బన్

పండ్లకు భలే గిరాకీ

- పుచ్చకాయ, దోసకాయలకు పెరిగిన డిమాండ్
- జ్యూస్ సెంటర్ల వద్ద బారులు తీరుతున్న ప్రజలు



పుచ్చకాయలు అమ్ముతున్న వ్యాపారి


జ్యూస్‌కు గిరాకీ

ఆసిఫాబాద్‌రూరల్: ఎండాకాలం ప్రారంభమైంది. రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి. ఈనేపథ్యంలో జిల్లావాసులు ఎండ నుంచి ఉపశమనానికి పుచ్చకాయ, దోసకాయలు వంటి పండ్లను కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు జ్యూస్ సెంటర్లకు సైతం గిరాకీ బాగా పెరిగింది.

పెరిగిన పుచ్చకాయల కొనుగోళ్లు

వేసవిలో చల్లదనాన్ని ఇచ్చే దోస, పుచ్చకాయలకు డిమాండ్ పెరిగింది. జిల్లాకేంద్రంలోని పలుకూడళ్ల వద్ద తోపుడు బండ్లపై దోసకాయలు విక్రయిస్తున్నారు. వీటిని కిలోకు రూ.40 నుంచి రూ.50ల ధరకు అమ్ముతున్నారు. మార్కెట్‌లో పుచ్చకాయలు కిలోకు రూ.30 నుంచి రూ.40 వరకు విక్రయిస్తున్నారు. పుచ్చకాయలను చిన్న సైజుల్లో కట్‌చేసి చల్లని ఐస్‌ను వాటిపై పెట్టి అమ్ముతున్నారు. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు జిల్లావాసులు పెద్ద ఎత్తున దోస, పుచ్చకాయలను కొనుగోలు చేస్తున్నారు. ఎండ తీవ్రత తట్టుకునేందుకు జ్యూస్ సెంటర్ల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు.


జ్యూస్ సెంటర్‌లో జనం సందడి

పండ్ల జ్యూస్‌కు మంచి గిరాకీ ఉంది. రోజుకు రూ.1500 నుంచి రూ.2500 ఆదాయం వస్తుంది. మా వద్ద ఆరు రకాల పండ్ల జ్యూస్‌లు తయారు చేసి అమ్ముతున్నాం. ఒక గ్లాస్ జ్యూస్‌ను రూ.20లకు విక్రయిస్తున్నాం.
– హిమబిందు, జ్యూస్ సెంటర్ నిర్వాహకురాలు

రోజూ పండ్లు తింటా



పండ్లలో అనేక రకాల పోషకాలు ఉంటాయి. మా ఇంట్లో మేం రోజూ పండ్లు తింటాం. సీజనల్‌లో వచ్చే పండ్లను తప్పకుండా ఆహారంలో భాగంగా తీసుకుంటాం. వేసవిలో పుచ్చకాయలు, దోసకాయలు వంటివి తీసుకుంటాం.
– సత్తయ్య, స్థానికుడు

పండ్లతో ఆరోగ్యం



వేసవిలో ఎండ నుంచి ఉపశమనానికి కూల్‌డ్రింక్స్ తాగుతుంటారు. కాని వాటికి బదులు పండ్ల జ్యూస్‌లు, కొబ్బరి బొండాలు తాగడం ఎంతో మంచిది. దోసకాయలు, పుచ్చకాయలు వంటి నీటి శాతం ఎక్కువగా ఉన్న పండ్లను తీసుకోవడం వల్ల ఆరోగ్యం లభిస్తుంది. నిత్యం ఆహారంలో పండ్లను చేర్చుకోవాలి.
– సత్యనారాయణ, వైద్యాధికారి, అడ పీహెచ్‌సీ

ఆరోగ్యానికి మేలు..

మార్కెట్‌లో ప్రస్తుతం ఎక్కువగా దోస, కీరదోస, తాటిముంజలు, ద్రాక్ష, కర్బూజ, సపోట, కొబ్బరిబొండాలు కన్పిస్తున్నాయి. పండ్లలో ఎన్నో పోషక విలువలు ఉండడంతో ప్రజలు వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. శరీరానికి అవసరమయ్యే పీచు పదార్థాలు, విటమిన్ ఏ, సీ, పొటాషియం, మెగ్నీషియం, జింక్, పాస్ఫరస్, ఐరన్, కాల్షియం వంటి ఎన్నో పోషకాలు పండ్లలో లభిస్తా యి. కివీ పండ్లలో 27 రకాల పండ్లలో లభించే పోషకాలు లభిస్తాయని వైద్యులు చెబుతున్నారు. సహజసిద్ధమైన యాంటి ఆక్సిడెంట్లను ప్రసాదించే పండ్లను తీసుకుంటే ఆరోగ్యవంతంగా ఉంటారని వైద్యులు సూచిస్తున్నారు. వీటిని తీసుకోవడం వల్ల క్యాన్సర్, మధుమేహం, మూత్రకోశసంబంధిత వ్యాధులను నివారించవచ్చని పేర్కొంటున్నారు.

ప్రజాసమస్యలపై స్పందించాలి


సమీక్షలో సమస్యలు చదివి విన్పిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: ప్రజాప్రతినిధులు తెలియజేసే అన్ని సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఈనెల 1న ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజాప్రతినిధులు సభా దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను ఎంపీడీవో సత్యనారాయణ శాఖల వారీగా చదివి విన్పించారు. ఐసీడీఎస్ సీడీపీవో రెబ్కా మాట్లాడుతూ ముకదంగూడలోని అంగన్‌వాడీ విధులు సక్రమంగా నిర్వహించకపోవడంతో మెమో జారీ చేశామన్నారు. కెరమెరి, సుల్తాన్‌గూడ పరిధిలోని నాలుగు కేంద్రాలు అద్దెభవనంలో కొనసాగుతున్నాయని స్థలాలు చూపిస్తే వాటి నిర్మాణాలు చేపడుతామన్నారు. అయితే నాలుగు కేంద్రాలకు స్థలాలు గుర్తించినట్లు ఎంపీటీసీ ఇఫ్తేకార్ తెలిపారు. కేసీఆర్‌కిట్, ఏఎన్‌సీ, గర్భిణులకు సంబంధించిన నిధులు విడుదల కాగానే లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తామని పీహెచ్‌సీ వైద్యుడు వెంకటేశ్ తెలిపారు. దేవాపూర్ సబ్‌సెంటర్ నిర్మాణానికి తీర్మానం చేశారు. కెరమెరి, దేవాపూర్, టిమ్మగూడ గ్రామాల్లో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని, ముకదంగూడ, కెరమెరి, కరంజివాడలో నూతన స్తంభాలు వేయాలని ఎంపీటీసీ ఇఫ్తేకార్, సర్పంచ్ లింబాదాస్ కోరగా, విద్యుత్ ఇంజినీర్ రమేశ్ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ పంచాయతీల్లో ఇదివరకు చేపట్టిన నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు విడుదల చేయాలని సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఎంపీవో సుదర్శన్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కుమారి, లత, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది సుధాకర్, ప్రసాద్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు న్యానేశ్వర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు ఉన్నారు.

రైస్‌మిల్లు నిర్మాణ పనులు నిలిపివేయాలి


డీటీకి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

దహెగాం: మండల కేంద్రం సమీపంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన రైస్‌మిల్లును నిలిపివేయాలని పలువురు రైతులు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ బక్కయ్యకు వినతిపత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ రైస్‌మిల్లు నిర్మిస్తే పక్కనే ఉన్న రైతుల భూముల్లో సాగు చేసే పంటలపై ప్రభావం పడుతుందన్నారు. గ్రామానికి సమీపంలో నిర్మిస్తున్నందున గ్రామస్తులకు సైతం ఇబ్బంది కలుగుతుందని పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మొర్లె నాందేవ్, కార్తీక్, వెంకటేశ్, మొర్లె రమేశ్, శ్యాంరావు, తదితరులు ఉన్నారు.

ఉచిత విద్యుత్ మీటర్లు వద్దని వినతి

- అధికారుల వేధింపులే కారణం


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తిర్యాణి: ప్రభుత్వం అందించిన ఉచిత విద్యుత్ మీటర్ల వినియోగంలో విద్యుత్ అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, తమకు ఉచిత విద్యుత్ మీటర్లు వద్దంటూ మండలంలోని రజక వృత్తిదారులు తహసీల్దార్ అనంతరాజు, విద్యుత్ సబ్ ఇంజనీర్ ప్రణీతకు శనివారం వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. రజక సంఘం మండల అధ్యక్షుడు నల్లూరి జగదీశ్ మాట్లాడుతూ లబ్ధిదారులకు ప్రభుత్వం ప్రతినెలా 250యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ వినియోగించుకునేందుకు అవకాశం కల్పించినా కొంతమంది విద్యుత్‌శాఖ అధికారులు ఉచిత మీటర్లకు సైతం బిల్లులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో పాటు ఉచితంగా అందించిన మీటర్ల వాడకంపై నిత్యం ఇళ్లల్లో తనిఖీలు చేస్తూ తమను దొంగలుగా చిత్రీకరించేందుకు యత్నిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత విద్యుత్ మీటర్లను తొలగించుకునేందుకు తమకు అవకాశం కల్పించాలని కోరారు. రజక సంఘం నాయకులు రాగళ్ల రాజమౌళి, దుర్శెట్టి సతీశ్, పున్నం హరీశ్‌కుమార్, సంతోశ్, మల్లేశ్ ఉన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న సంఘం నాయకులు

కౌటాల: విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ పవర్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కో కన్వీనర్ ఎమ్మాజి సతీష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఏడాది నుంచి విద్యుత్ ఉద్యోగులకు రావాలిన్సన వేతన సవరణను వెంటనే ప్రకటించాలన్నారు. ఆర్టిజన్ కార్మికులకు 50శాతం ఫిట్మెంట్‌తో పాటు కన్వర్షన్ అవకాశం ఇవ్వాలని తెలిపారు. అన్‌మ్యాన్డ్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 16వ తేదీలోగా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఈనెల 17 నుంచి సమ్మె చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జాక్ నాయకులు రవీందర్, చిప్ప రమేశ్, చంద్రశేఖర్, ధర్మయ్య, అశోక్, మాధవ్, రామ్మూర్తి, ప్రశాంత్, సుధాకర్, సంపత్, రవికుమార్, వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి విద్యుత్ ఉద్యోగుల సమ్మె

కాగజ్‌నగర్‌టౌన్: విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17వ తేదీ నుంచి సమ్మె చేయనున్నట్లు తెలంగాణ పవర్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కో కన్వీనర్ ఎమ్మాజి సతీష్ తెలిపారు. 2022 ఏప్రిల్ 1వ తేదీ నుంచి రావాల్సిన వేతన సవరణను తక్షణమే ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

జేపీఎస్, ఓపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలి


సమ్మె నోటీసు అందజేస్తున్న జేపీఎస్, ఓపీఎస్‌లు

రెబ్బెన: గ్రామాల అభివృద్ధికి అహర్నిశలు పని చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులతో పాటు, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని మండలంలోని జేపీఎస్, ఓపీఎస్‌లు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఎంపీడీవో కార్యాలయంలో మండల పంచాయతీ అధికారి అంజద్‌పాషాకు సమ్మె నోటీసు అందజేశారు. వారు మాట్లాడుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేస్తూ జీవో విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నమృత, సాధన, శరణ్య, సౌందర్య, సౌమ్య, స్రవంతి, సరిత, మీనాక్షి, ధనలక్ష్మి, కిరణ్‌కుమార్, శ్రావణ్‌కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సమ్మె నోటీసు

పెంచికల్‌పేట్: మండలంలో పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28వ తేదీ నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు శనివారం ఎంపీడీవో గంగాసింగ్‌కు సమ్మె నోటీసు అందజేశారు. వారు మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రకటించిన విధంగా రాష్ట్రంలో పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శ్రీకాంత్, రాకేష్, ఖుషీద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్


ఇఫ్తార్‌లో పాల్గొన్న రావి శ్రీనివాస్

కాగజ్‌నగర్‌టౌన్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ సిర్పూర్ తాలుకా నాయకుడు రావి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ దస్తగీర్ అహ్మద్, మాజీ కౌన్సిలర్ షబ్బీర్ హుస్సేన్, నాయకులు ఎమ్మాజి సంతోష్, హబీబ్, హాజి, యలమంచిలి వేణు తదితరులు పాల్గొన్నారు.

'పనుల్లో నిర్లక్ష్యం వద్దు'

వాంకిడి: 'మన ఊరు–మన బడి' కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పనులను నిర్లక్ష్యం చేస్తే కఠినచర్యలు తప్పవని డీఈవో అశోక్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో 'మన ఊరు–మన బడి'కి ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. ఈనెల 30లోపు పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆయా పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

నార్నూర్: ప్రతిఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని మేజిస్ట్రేట్, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ శ్రీమతి దుర్గారాణి అన్నారు. శనివారం గాదిగూడ మండలంలోని లోకారి(బి)లో, నార్నూర్ మండలంలోని ఉమ్రీ గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయం, మోటర్ వెహికిల్ చట్టాలపై, వరకట్న వేధింపులుపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీఐ ప్రేంకుమార్, ఎస్సై రవికిరణ్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్(టి) గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థిని శ్రీవాణి మృతికి కారకులైన పాఠశాల అధికారులపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థిని మృతి ప్రభుత్వ హత్యేనని అఖిలపక్షం నాయకులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, తాలుకా నాయకులు డాక్టర్ హరీష్ బాబు, కాంగ్రెస్ నాయకులు రావి శ్రీనివాస్, బీఎస్పీ తాలుకా ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్, సీఐటీయూ నాయకులు ముంజం ఆనంద్ కుమార్‌లు ఆరోపించారు. శనివారం స్థానిక కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో విద్యార్థిని మృతికి నిరసనగా ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ మృతి చెందిన విద్యార్థిని కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి దోషులైన హాస్టల్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: 2023–24విద్యా సంవత్సరానికి గాను అర్హత గల షెడ్యూల్ కులాలు (ఎస్సీ) బాలబాలికల నుంచి హైదరాబాద్‌లోని పబ్లిక్ స్కూల్–బేగంపేటలో 2సీట్లు 1వ తరగతి ఇంగ్లీష్ మీడియం ప్రవేశం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు రవీందర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు 2017 జనవరి 1నుంచి 2017డిసెంబర్ 31మధ్య జన్మించి ఉండాలని, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ1లక్షా 50వేలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2లక్షలు మించి ఉండరాదని, పుట్టిన తేదీ ధృవీకరణ పత్రం సంబంధిత తహసీల్దార్, మున్సిపాలిటీ నుంచి పొంది ఉండాలని, ఆదాయం, కుల ధృవీకరించి దరఖాస్తుకు జత పరుచాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తుఫారం జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయంలో ఈ నెల 17 నుంచి మే 1వరకు కార్యాలయంలో అందించాలన్నారు. 2కలర్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఒరిజనల్ సర్టిఫికెట్స్ జత చేసి దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. అభ్యర్థులకు లాటరీ ప్రక్రియ ద్వారా ఎంపిక ఉంటుందని, దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆకట్టుకున్న విన్యాసాలు


విన్యాసాలు నిర్వహిస్తున్న సిబ్బంది

కాగజ్‌నగర్‌టౌన్: అగ్నిమాపకశాఖ వారోత్సవాలను పురస్కరించుకొని శనివారం ఆ శాఖ అధికారులు పలు కార్యక్రమాలు చేపట్టారు. కాగజ్‌నగర్ ఫైర్ ఆఫీసర్ జీ సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది స్థానిక కార్యాలయంలో అగ్ని ప్రమాదంలో అసువులు బాసిన సిబ్బంది ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం అగ్నిమాపకశాఖ వినియోగించే యంత్రాలు, ఇతర సామగ్రిని ప్రదర్శించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఫైర్ సిబ్బంది నిర్వహించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. లీడింగ్ ఫైర్‌మన్లు మురళీమోహ న్‌రెడ్డి, విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వనంలో పశువులు


ఐనం ప్రకృతివనంలో సంచరిస్తున్న పశువులు

దహెగాం: పల్లెల్లో ఆహ్లాదకర వాతావరణం కోసం పల్లెప్రగతిలో భాగంగా ప్రతీ గ్రామంలో ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. ప్రకృతి వనాలపై పర్యవేక్షణ లేకపోవడంతో వనాల్లో పశువులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. మండలంలోని ఐనం గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనంలో శనివారం పశువులు సంచరిస్తూ దర్శనమిచ్చాయి. ప్రకృతివనంలోని మొక్కలు పశువులకు మేతగా మారాయని స్థానికులు వాపోతున్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం


సన్మానిస్తున్న బీజేవైఎం నాయకులు

ఆసిఫాబాద్: బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మూడోసారి ఎన్నికైన బోనగిరి సతీశ్‌బాబును బీజేవైఎం ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎలగతి సుచిత్, బీజేపీ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ జుమ్మిడి రాజేశ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు వికాస్ తదితరులు పాల్గొన్నారు.